మల్లి దొంగచూపులు చూస్తూనేవుంది.

మల్లి అతన్ని ప్రేమించిందా? అతను మల్లి కలిసి వచ్చి వుంటారా? మల్లి దారి తప్పిన పని చేసిందా? అతనెవరు? ఈ కథకి ముగింపు?

చిలక జోస్యం చెప్పదు.

మల్లి కారేజి సర్దుకొని తొందర పని వున్నట్టు వెళ్ళిపోయింది.

వూహల గడ్డిగొంచలమధ్య గాలి తెర లాటి మనసు. అయోమయపు ఆశ. దారుణాలు ఎరుగని దైవత్వం. అందానికి సామ్రాజ్యపురాణి.

రెండు చెమట బిందువులు నుదుటినుంచి జారి కనురెప్పలకు అంటుకున్నాయి. ప్రశ్నలు అతని కళ్ళను కలవరపరుస్తున్నాయి. "రేపు"అనబడే గదికి ఏరోజుకు ఆరోజు తలుపులు వేసే వుంటాయి. వాటంతటనే తెరుచుకునే తలుపుల్లో ఏముందో ఎంతెలుస్తుంది?

* * *

వీధులలో విద్యుద్దీపాలు. మేడలలో మెర్క్యురీ దీపాలు.

మెల్లగా యిల్లు చేరాడు.

శవం పోయిన ఇల్లులా, వూరి చివర వల్లకాడులా నిశ్శబ్దంగా వుంది ఇల్లు. ఆ గుడిసెలో గుడ్డిదీపం వేదాంతిలా వెలుగుతూంది. తన అడుగుల చప్పుడికి తడికె కదలికకు తల తిప్పింది భార్య. బావురుమనలేక గొంతు బిగపట్టి మూలుగుతున్నట్టు ఏడ్చింది. మూర్తివిస్తుపోయాడు. చిలక పంజరం ప్రక్కనే పెట్టి సమీపించాడు.


"ఏమయింది?"

"మల్లి .... మల్లి ...." ఆత్రుతగా ఆమె ముఖాన్ని వెతుకుతున్నాడు "మల్లి లేసి పోయింది. రైలెక్కుతుంటే రాఘవులు చూశాడంట. ఎవడితో పోయిందో?"

మూర్తి మెదడులో నరాలు చిక్కుబడ్డాయి. తన కూతురు ఎక్కడుందో? ఎలా వుందో? ఏమవుతుందో? ఏ అంగడిలో అంగడి బొమ్మ అవుతుందో?

—చిలక జోస్యం చెప్పదు.

---



# కళ్ళు

చైతన్య

మాటలతో వ్యక్తం చేయలేనిభావాలన్నీ కళ్ళతో చేయవచ్చని యెప్పుడో, యెక్కడో, బహుశ పూర్వాశ్రమంలో చదివినట్టు గుర్తు. ఈ బొంబాయి నగర జీవితానికి అలవాటుపడ్డాక అన్నీ మర్చిపోయాను సార్. "నువ్వు పూర్వజన్మలో చేసుకొన్న పాపఫలానికి ఈజీవితకాలంలో ఒక సంవత్సరం బొంబాయిలో బ్రతకమని" శపించి నా లలాటంపై లిఖించారు బ్రహ్మజీ?

సదరు బ్రహ్మగారి ఆర్డరు ననుసరించి మా స్టాఫ్ మేనేజరు నన్ను ట్రైనింగ్ నిమిత్తం బొంబాయి ప్రయాణం కట్టించారు. బ్రహ్మచారిగాడు వాడెక్కడయినా బ్రతగ్గలడని.

"ఇంతేలే ఈ జీవితం...."

"కల అయినా నిజమయినా" అని పాడుకుంటు మీనార్ ఎక్స్‌ప్రెస్ లో బొంబాయి చేరుకొన్నా. బ్రహ్మచారిగాడ్ని బ్రతకటానికి ఆరడుగుల నేల (పడుకోవటానికే. ఎలాగా పగలంతా ఆఫీసు. రోడ్ల మీదే బ్రతుకుతాం) కోసం మహ కష్టపడి జుహు బీచ్ ఏరియాలో తలదాచుకోవటానికి చోటు చూసుకొన్నా. నేనుండే ఫ్లాట్ కి ఎదురుగా ఇంకో భవనం. అగ్గిపెట్టెలాంటి అయిదంతస్తుల భవనం. అఫ్ కోర్స్- మాదికూడా అంతే అనుకోండి. నేను మా ఫ్లాట్ లోకి వచ్చి నెలయినా ఒక జత కళ్ళు ఎదుటి బిల్డింగ్ లో నుండి నన్ను అబ్జర్వ్ చేస్తున్నట్టు తెలుసుకోలేకపోయాను. పూర్ ఫెలోని. ఎలా గమనించానంటే విండోకి మిర్రర్ తగిలించి హెయిర్ డ్రెస్ చేసుకొంటున్నాను. ఎదటి ఫ్లాట్ లో విండో కర్టెన్ కొద్దిగా జరిగి రెండు కళ్ళు చోటు చేసుకొన్నాయి. "అరె అంటు ఆశ్చర్యపోయి ఆవలించేసరికి ఆ కళ్ళు మాయమయ్యాయి. విసుగొచ్చి విక్రమార్కుడైనా పట్టు వదలొచ్చేమోగాని నేనుమాత్రం ఆ కళ్ళగురించి తెలుసుకొంటేనేగాని నిద్రపోకూడ దనుకొన్నా (అఫ్ కోర్స్, ప్రతిరోజు పన్నెండు గంటలు నిద్రపోతున్నాన్సార్). రోజులు గడుస్తున్నాయి. నా యిన్వెస్టిగేషన్ లో యింప్రూవ్ మెంటు ఏమాత్రం కనబడలేదుగాని ఆ కళ్ళు మొదటిసారిలా భయంగా కాకుండా ధైర్యంగా సూటిగా చూడటం ప్రారంభించాయి. హేట్సాఫ్ టు దోజ్ ఐస్. నేను కళ్ళలో కళ్ళు కలిపేసరికి సిగ్గో, భయమో మరి ఆ కళ్ళు మెల్లగా వాలిపోయేవి.

మళ్ళీ క్రీగంటచూపులు. మీనాల్లాంటి కళ్ళుగల ఆ మీనాక్షి లేత దొండపండు రంగు పెదవులు, ఆపిల్ రంగు బుగ్గలు, గెడ్డందగ్గర పుట్టుమచ్చ చూస్తుంటె ఎగిరెళ్ళి గట్టిగా ముద్దెట్టుకోవా లనిపిస్తుంది. ఆ నా మీనాక్షి అందాన్ని వరించటానికి మళ్ళీ పుట్టి కవిఅవాలనుకున్నా. రోజూ ఆ కళ్ళు ఏవో బాసలు చెప్తున్నాయి. మా కిటికీ పరిచయంఎంతవరకు వచ్చిందంటె, నవ్వుకుంటూ సైగలు చేసుకొనేవరకు వచ్చింది అతి కష్టంమీద ఇంకో నెలకి. (ఫాస్ట్ ఇంప్రూవ్ మెంటు కదూ.) మాటలు కలపక పోయినా చూపులతో.... కార్లలో షికార్లు తిరక్కపోయినా మా పరిచయం ఇలా దినదినాభివృద్ధి అయింది ఓ రోజు ప్రతిరోజు కన్పించే టైముకి ఆ కళ్ళు కనిపించకపోయేసరికి నా కళ్ళు ఎవరి పర్మిషన్ తీసుకోకుండా వాళ్ళ కిటికీ గుండా లోపలి కెళ్ళిపోయి మీనాక్షి కోసం తెగవెదికేస్తున్నాయి. బుర్ర తీవ్రంగా మీనాక్షి జాడ ఎక్కడా అని ఆలోచిస్తూంది. బాత్రూంలోంచి టవల్ చుట్టుకొని హాల్లోకి వచ్చేసి ఫాన్ స్విచాన్ చేసింది తడిసిన ఒళ్ళు ఆరటానికి టవల్ చుట్టుకునే. అలవాటు ప్రకారం మా ఫ్లాట్ వైపు చూసింది నేను కన్పించేసరికి కంగారు పడి చుట్టుకొన్న టవల్ వదిలేసి లోపలికి పరిగెత్తింది. మీనాక్షిని చూశాను. మళ్ళీ ఈ జన్మకు నాకు మొహం చూపదేమో అనే బాధ. దుఃఖంతో రూం లాక్ చేసి మేడ దిగాను ఆఫీసు కెళ్ళాలని. ఆశ్చర్యం బాల్కనీలో మీనాక్షి. కన్పించదనుకొన్న నా మీనాక్షి కన్పించడమేకాక నన్ను చూసి నవ్వుతోంది! ఆనందంతో చేయి ఊపాను. చేతి వేళ్ళను వింతగా కదిలిస్తూ తన చిన్ని చేతిని సుతారంగా ఊపుతోంది. నాలుగేళ్ళ గీత- ఐ మీన్ నా మీనాక్షి.